

# నేటి బామ్మ

ఎమ్. హేమలత

"అమ్మా...మమ్మీ...అమ్మీ...మాతా...అన్నపూర్ణాదేవీ..." కిచెన్ లోనికి ప్రవేశించి గావు కేకలు పెడ్తున్న కిరణ్‌ని చూసి నవ్వుతూ సరస్వతి, "ఏం నాన్నా! ఇంకే భాషాపదాలు మిగల లేదా నీ మాతృమూర్తిని సంబోధించ డానికి!" అంది.

"కమ్మటి సువాసనలు నా నాసికను-నన్నూ ఇలా లాక్కొచ్చాయి మమ్మీ! ఇంతకీ ఏంటి రోజు విశేషం?" స్టవ్ మీదున్న గిన్నెలోకి తొంగి చూస్తూ అన్నాడు కిరణ్.

"ఒరే బడుద్దాయీ! ఈ రోజు మీ నానమ్మ పుట్టిన రోజు. అరవై ఏళ్లు నిండాయి."

"ఓహో! షష్టిపూర్తన్న మాట! ఇంకేం- మరి తాతగారికి చేసినట్లు నానమ్మకి కూడా ఘనంగా జరిపించేద్దాం..." పక్కనే తరిగి పెట్టిన దోసకాయ ముక్కలను స్వాహా చేసే ప్రయత్నంలో వుండగా, కిరణ్ చేతిమీద ఒక్కటేసి, సరస్వతి ఆ ప్లేటు అక్కడి నుండి లాగేసింది.

"నాకు షష్టిపూర్తి ఏమిటిరా..."అంటూ వంటింటి ప్రవేశం చేసింది, పుట్టిన రోజు పాపాయి- అవిడే అరవై ఏళ్ల పాపాయమ్మ.

"వాడన్న దాంట్లో మాత్రం తప్పేముంది అత్తయ్యగారూ! ఏం మగాళ్లకేనా...ఆడవాళ్లకి కూడా షష్టిపూర్తి ఎందుకు చెయ్యకూడదూ..." రెట్టించింది సరస్వతి. మహిళా మండలి కార్యక్రమాల్లో మంచి వక్త మరి. ఆ మాత్రం స్త్రీవాదం చేయకుంటే ఎలా...?

కాఫీ కోసం వంటిల్లు చేరిన కృష్ణమూర్తి- ఆయనే ఈనాటి వి.ఐ.పి గారి సాక్షాత్తు భర్తగారు, కోడల్ని వెనకేసుకొస్తూ, "షష్టిపూర్తి ఎలాగూ నాతో కలిసే చేసుకున్నావు. కనుక, ఈ నీ పుట్టిన రోజు పూర్తిగా నీది. నువ్వు ఎలా చెబితే అలా నడుచుకొని, నువ్వు అనుకున్న కార్యక్రమాలకి నిబద్ధులమవుతాం" అంటూ శిరస్సు వంచి భార్యకు అభివాదం చేసాడు.

"ఛాల్లెండి! ఇక వూర్కోండి. ఎవరైనా చూస్తే నవ్విపోతారు. మహా అప్పటికి నే గీచిన గీటు దాటనట్లే మాట్లాడుతున్నారు..."

"చూడమ్మా! సరస్వతీ! మీ అత్తగారు ఎంత ఆప్యాయంగ మాట్లాడుతున్నారో! అప్పటికి, ఆవిగీత గీచినట్లు- నేను దాటినట్లు. ఇప్పుడు గీయమను- నేను దాటితే అప్పుడు చెప్పమను..."

మామయ్యగారు, ప్రసంగాన్ని హాస్యంలోకి దింపడం చూసి సరస్వతి ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ, భర్తకి టిఫిన్ ఇవ్వడమనే నెపంతో అక్కడి నుండి నిష్క్రమించింది.

"నానమ్మా! నీ గీతల సంగతేమో కానీ- 'గీత్-సంగీత్' థియేటర్‌లో మంచి మూవీ ఆడుతోంది. అదీ- నీకిష్టమైన పాత పిక్చర్. నువ్వు ఊ..అంటే నిన్ను తీసికెళ్తాను..." అన్నాడు కిరణ్, నానమ్మ భుజాల మీద చేతులు వేసి.

"ఒరి వెధవా! మధ్యలో నువ్వెందుకురా పానకంలో పుడకలాగా మాతోటి సినిమాకి! ఏం...మేము పోలేమా! అయినా మీరు చూసే సినిమాలు మీ నానమ్మకి ఏం నచ్చుతాయిరా!" అన్నాడు కృష్ణమూర్తి.

## వెంకటేష్ సరసన ట్వింకిల్

సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకటేష్ హీరోగా రామానాయుడు తీస్తున్న సినిమాకి హీరోయిన్ ట్వింకిల్ ఖన్నాని సెలెక్ట్ చేశారు. దీనికి ఉదయ్ శంకర్ అనే తమిళ నూతన దర్శకుడు దర్శకత్వం చేస్తున్నాడు. ఇప్పటిన రకు ప్రేక్షకులు చూడని ట్వింకిల్ అందాలన్నీ తెరమీద చూపించేస్తానంటున్నాడు.



"ఔను...అదీ నిజమే! మాదంతా ఫాస్ట్-ఫుడ్. మీదంతా పాత చింతకాయ పచ్చడి..."వెక్కిరించాడు కిరణ్.

"సరే! సరే! పాపా...నీ పూజ పూర్తయినట్లుంది...టిఫిన్ కానిచ్చేయ్- మార్నింగ్‌షోకి వెళ్దాం.." అన్నాడు, కృష్ణమూర్తి.

"కోడలేదో పిండివంటల హడావిడిలో వుంది. భోంచేసి వెళ్దామండీ..." అంది పాపాయమ్మ.

"అలాగే కానీ...ఈ రోజంతా ఎట్ యువర్ సర్వీస్ మేడమ్..."అన్నాడు కృష్ణమూర్తి నవ్వుతూ.

"ఏమండీ! ఈరోజు నాకిష్టమైన పిక్చర్‌కి తీసికెళ్తానంటేనే నే వచ్చేది..." ముప్పై ఏళ్లనాటి అలక పలికిస్తుంటే ముచ్చటేసింది కృష్ణమూర్తికి.

"అలాగే..నీ ఇష్టం అన్నానుగా! అయినా, పాత సినిమా- మాట్నీలు ఆడుతున్నాయో లేదో- నేను పేపరు చూసి చెప్తానులే..."అంటూ పేపరు కోసం ముందు గదిలోకి నడిచాడు కృష్ణమూర్తి.

సాయంత్రం ఏడుగంటల టైములో "హాయ్ మమ్మీ!" అంటూ గృహప్రవేశం చేసిన కిరణ్ "నానమ్మా! తాతయ్యా!! " అంటూ గావు కేకలు పెడ్తూ లోనికి తొంగి చూశాడు.

"ఏంటిరా ఆ కేకలు! మీ తాతయ్య వాళ్లు ఇంకా రాలేదు. అయినా ఎందుకా అరుపులు...?" అంది కాస్త కోపంగా సరస్వతి.

"అక్కడ్నుంచి గుడి కెళ్లారేమో...!" అన్నాడు మోహనరావు- ఆయనే సరస్వతి భర్త.

కైనటిక్ హోండా చప్పుడికి తిరిగి చూసిన సరస్వతి- "అదిగో! మామయ్య వాళ్లు వచ్చారు..." అంది.

"తాతయ్యా! కాదు.. కాదు నానమ్మా! మీరేం మూవీ కెళ్లారు? బోలో...బోలో...చెప్ప.. చెప్ప.." అంటూ. గేటు దగ్గే అటకాయించాడు కిరణ్. బిత్తరపోయిన పాపాయమ్మ భర్తకేసి బేలగా చూసింది.

"వెధవ...వెధవన్నర వెధవ...మమ్మల్ని అక్కడ చూసి చచ్చాడేమో!" కృష్ణమూర్తి కొంత కలవర పడ్డా వెంటనే తేరుకొని, "ఏంట్రా...ఏం పెద్దగా అడిగిస్తున్నావు! మా ఇష్టం...మా ఇష్టమొచ్చిన సినిమాకి వెళ్తాం..." అన్నాడు.

"అదే చెప్పమంటున్నాను గ్రాండ్‌పా..."నవ్వును పెదాల చాటున దాచుకుంటూ మళ్లీ రెట్టించాడు కిరణ్.

"నన్ను ఎక్స్‌పోజ్ చేయద్దు..." అన్నట్లు జాలిగా చూస్తున్న భార్యకేసి చూస్తూ "ఫర్వాలేదన్నట్లు" సైగ చేసి "ఔనా..'ఫైర్' సినిమాకి వెళ్లాం. ఇలాంటి సినిమాలు, పిల్లలు ఎందుకు చూడకూడదో తెల్సుకొని సెన్సార్ బోర్డు వాళ్లకి రాద్దామని వెళ్లాం. ఇప్పుడు చెప్ప ఏం చేస్తావో..." మనుమడి కేసి చూసాడు కృష్ణమూర్తి.

ఇటు తిరిగిన సరస్వతి, అత్తగారు కృతజ్ఞతాపూర్వకంగా మామగార్ని చూడడం గమనించి, ఇందులో సూత్రధారి ఎవరో గ్రహించినదై నవ్వుకుంటూ, "చాల్లేవోయ్ పెద్ద బడాయి...ఈ డిటెక్టివ్ పనులెప్పటి నుండీ" అంటూ కొడుకు వైపు చూస్తూ లోనికి నడిచింది.

గుంభనంగా నవ్వుకుంటూ మోహనరావు పేపరు వెనుక తన ముఖాన్ని దాచేసుకున్నాడు.